సాక్షి నంద్యాల

బుధవారం ׀ 8 ׀ నవంబర్ ׀ 2023



## ఉత్సాహం ఉరకలు

సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.



## వరుణుడు దీవించగా..

బస్సు యాత్ర ఆళ్లగడ్డ చేరిన సందర్భంలో వర్షం కురిసింది. వాన పడుతున్నా అభిమానులు వేదిక చుట్టుపక్కల తడుస్తూనే వేచి ఉన్నారు.



## మీ వెంటే మేము..

సభలో నేతలు ప్రసంగిస్తున్న సమయంలో జై జగన్ అంటూ అభిమానులు నినదించారు. మళ్లీ సీఎం అంటూ హోరెత్తించారు.

## న్యూస్‌రీల్

### విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): విభిన్న ప్రతిభావంతులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మంగళవారం స్థానిక ఎస్పీజీ మైదానంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 6 నుంచి 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు జిల్లా స్థాయి ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులకు స్పోర్ట్స్ టీ షర్టులను, ఐదవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు హియరింగ్ ఎంప్లైమెంట్, బ్లయిండ్ విద్యార్థులకు కలెక్టర్ టాప్స్ పంపిణీ చేశారు. ఆటల పోటీలలో బేస్ బాల్, ట్రై సైకిల్ రేస్, పరుగు పందెం, త్రోబాల్, అంధ విద్యార్థులకు, సెలబ్రెల్ పాలసీ పిల్లలకు స్లో వాకింగ్, త్రో బాల్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త రఘురామిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ అఫీషియో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఏపీ సమగ్ర శిక్ష సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు డోన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్

కర్నూలు (రాజ్‌విహార్): వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు డోన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద విద్యుత్ డివిజన్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె. రామమోహన్ రావు, ఎల్. అంజని కుమార్, జి. ఈశ్వరమ్మ హాజరవుతారన్నారు. కర్నూలు డివిజన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు విద్యుత్ అదాలత్‌కు హాజరై తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

### ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లె సమీపంలో శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ ఉదయం 11.30 గంటలకు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశానని, ఆ సమయంలో ఉపాధ్యాయులు శ్రీపాదరావు, శ్రీనివాసనాయక్ ఎవరి అనుమతి లేకుండా బయటకు వెళ్లినట్లు గుర్తించానన్నారు. అంతేగాక పాఠశాలలో బెంచీలు ఉన్నప్పటికీ 34 మంది విద్యార్థులను కింద కూర్చోవడం గమనించామన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా విద్యార్థులను వదిలేసి విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించడంతో ఆ ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులను తూచా తప్పకుండా నిర్వర్తించాలన్నారు.

సంక్షేమ సారథి జగనన్న పాలనను కొనియాడుతుండగా వరుణుడు హర్షించాడు. సామాజిక చైతన్యం జన సంద్రంగా మారి అభిమానం ఉప్పొంగింది. జయహో జగనన్న నినాదాలు హోరెత్తగా ఆళ్లగడ్డ పులకించిపోయింది. సంక్షేమ పథకాలు అందుకున్న జనం చేతిలో జెండాలు రెపరెపలాడాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయంగా సాగింది.

- సామాజిక సాధికార బస్సు యాత్రకు జన నీరాజనం
- జనసంద్రమైన ఆళ్లగడ్డ పట్టణం
- ప్రజాప్రతినిధుల ప్రసంగాలతో నూతనోత్తేజం
- మిన్నంటిన జై జగన్ నినాదాలు



ప్రభంజనం.. ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలి జనసంద్రమైన దృశ్యం

# చైతన్యం ఉరిమి.. అభిమానం ఎగసి

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ఆళ్లగడ్డ ప్రజానీకం జనహారతులు పట్టారు. సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారులు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వంపై ఉన్న అభిమానాన్ని చాటారు. మంగళవారం సాయంత్రం ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలి జన సునామీని తలపించింది. సామాజిక సాధికార బస్సు యాత్రను జనం విజయవంతం చేశారు. తొలుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు స్థానిక మహాలక్ష్మీ ఫంక్షన్ హాలులో తటస్థులు, కుల సంఘాల పెద్దలతో సమావేశమయ్యారు. అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం బస్సుపైకి చేరుకుని యాత్రగా లింగందిన్నె రోడ్డు, కొత్త బస్టాండు మీదుగా పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి, ఎంపీలు బెల్లన చంద్రశేఖర్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా జేసీఎస్ కన్వీనర్ ఆకేపాటి అమరనాథరెడ్డి, కో కన్వీనర్ బాబూలాల్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాయబ్‌రసూల్, మరియమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు దిల్షాద్ బేగం, ఎంపీపీలు వీరభద్రుడు, గజ్జల రాఘవేంద్రా రెడ్డి, అమర్‌నాథరెడ్డి, బాలస్వామి, ముఖ్య నాయకులు సలాం, దాసరి నాగేంద్ర, ప్రసాదరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, వివిధ హోదాల్లో ఉన్న నేతలు పాల్గొన్నారు.



బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న మంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, బీసీ నేతలు

### దద్దరిల్లిన సభ..

సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సభ నేతల ప్రసంగాలతో దద్దరిల్లింది. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేసిన ప్రసంగాలు జనాన్ని ఉత్తేజ పరిచాయి. ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణస్వామి, విజయనగరం ఎంపీ బెల్లా చంద్రశేఖర్, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సుమారు గంటన్నర పాటు జరిగిన సభకు వచ్చిన జనం ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బెలూన్‌లతో ఆళ్లగడ్డలో పండుగ వాతావరణం నెలకొంది. నాలుగు రోడ్ల కూడలిలో కడప - నంద్యాల, కోవెలకుంట్ల - అహోబిలం రహదారుల్లో కనుచూపుమేర జనంతో నిండిపోయింది. మహిళలు సైతం బస్సు యాత్ర ముందు నడిచారు. యువత ఈలలు, కేకలు వేస్తూ బస్సు యాత్రలో సందడి చేశారు. ఆయా కాలనీల సమీపంలోకి వచ్చేసరికి మహిళలు మంగళ హారతలతో స్వాగతం పలికారు.

### జగనన్న అందరి వాడు

దశాబ్దాల రాజకీయ చరిత్రలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ.. అంటూ ఆప్యాయంగా పిలుస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. జగనన్న అందరి వాడు. టీడీపీ అధినేత చంద్రబాబులా ఒట్టి మాటలతో మోసం చేయకుండా జగనన్న సామాజిక సాధికారతను చేతుల్లో చూపారు. ఎప్పుడూ లేని విధంగా పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆళ్లగడ్డలో మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను ఎస్సీని చేసినా, నేడు నియోజకవర్గంలోని ఆరు మేజర్ గ్రామ పంచాయతీలకు ఎస్సీలను అందులో మహిళలను సర్పంచులను చేశారు. నాలుగున్నరేళ్లలో ఆయా వర్గాలకు జరిగిన మేలును వివరించేందుకే ఈ యాత్ర చేపట్టాం.

– ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

### ఇది ఎన్నికల శంఖారావం

సామాజిక సాధికారత అంటే నిర్వచనం చెప్పిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ బస్సు యాత్ర చేపట్టి ఎన్నికల శంఖారావం పూరించాం. ఇదే ఉత్సాహం వచ్చే ఎన్నికలు పూర్తయ్యేవరకు కొనసాగిద్దాం. నేటి నుంచి ప్రతి రోజు ప్రజల్లోనే ఉంటూ సమస్యలు పరిష్కరించుకుందాం. బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. బలహీన వర్గాలకు అన్ని రకాలుగా అండగా నిలిచిన వైఎస్సార్ సీపీని 175 స్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి.

– గంగుల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల సలహాదారు

### బడుగు, బలహీన వర్గాలకు పాలనలో భాగస్వామ్యం

ఆళ్లగడ్డ: బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకుని అధికారంతో పాలనలో భాగస్వామ్యం చేసిన ఏకైక నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా మంగళవారం స్థానిక మహాలక్ష్మీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర ఖురాన్, బైబిల్, భగవద్గీతగా భావించి అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. అందరికీ న్యాయం చేయాలనే దృఢ సంకల్పంతో అర్హత కలిగిన ప్రతి విలేకరికి ఇంటి స్థలం ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టిన బాబు బీసీలను నిట్టనిలువునా దగా చేశారన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ఆయన తన సామాజిక వర్గానికి తప్ప ఇతరులను ఎదగనీయలేదన్నారు. సీఎంగా జగన్ అధికారం చేపట్టిన రోజు నుంచే సామాజిక సాధికారత ఏంటో చూపించారన్నారు. బస్సు యాత్ర ఎక్కడికి పోయినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే ఎలా వస్తారో జనం అలా ఆదరిస్తున్నారంటే సంక్షేమ పథకాలే కారణమన్నారు. ప్రపంచ చరిత్రలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయని, నగదు కూడా నేరుగా వారి ఖాతాల్లోకి చేరడం గొప్ప విషయమన్నారు. నవరత్నాల్లో భాగంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇప్పటి వరకు పేదల అకౌంట్లో రూ.4.20 లక్షల కోట్లు జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ప్రత్యేకించి బీసీలకు రూ.1,62,593.6 కోట్లు, ఎస్సీలకు రూ.60,964.73 కోట్లు, ఎస్టీలకు రూ.17,134.84 కోట్లు, మైనార్టీలకు రూ.20,104 కోట్లు, ఇతర వర్గాల్లోని పేదలకు రూ.1,14,734 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడం ఆయా వర్గాలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. 30,50,000 ఇళ్లలో 16,60,500 ఇళ్లు కేవలం బీసీలకే ఇవ్వడం ఓ చరిత్రగా అభివర్ణించారు. బీసీలు, యాదవులు లేకుంటే టీడీపీ లేదని చెప్పిన చంద్రబాబు వారికి ఏమీ చేయలేదన్నారు. సీఎం జగన్ నేడు నలుగురు సోదరులను రాజ్యసభకు పంపిస్తే.. అందులో ఇద్దరు యాదవులు ఉండటం ఆయన ఆ వర్గానికి కల్పిస్తున్న ప్రాధాన్యత అర్థమవుతుందన్నారు. కంటి ఆపరేషన్ కోసం బయటకు వచ్చిన చంద్రబాబు భవిష్యత్‌లో గుండె, కిడ్నీ, క్యాన్సర్, బొల్లి ఆపరేషన్‌ల సాకుతో బెయిల్ కోరుతూనే ఉంటాడన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, అంజాద్‌బాషా, ఎంపీలు బెల్లన చంద్రశేఖర్, పోచా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

### మైనార్టీలకు పెద్దపీట

76 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఒక్క మైనార్టీ కూడా మంత్రిగా లేని కేబినెట్ ఏర్పాటు చేసిన ఘనుడు చంద్రబాబునాయుడు. నేడు జగనన్న మైనార్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు నాలాంటి వ్యక్తికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. నేడు ఎమ్మెల్సీలుగా నలుగురు ముస్లింలు ప్రాతినిధ్యం వస్తున్నారు. రానున్న ఎన్నికల్లో బక్క వాడికి, బలిసిన వాడికి మధ్య ఎన్నికలు జరుగనున్నాయి. – అంజాద్‌బాషా, డిప్యూటీ సీఎం

### బీసీలకు ప్రాధాన్యం

రాజ్యసభలో ఎనిమిది ఎంపీ స్థానాలు ఉంటే అందులో సగం బీసీలకు జగనన్న అవకాశం కల్పించారు. బీసీ వర్గానికి చెందిన మున్నూరు కాపునైన నాకు సీటు ఇచ్చి గెలిపించారు. బీసీలకు ఆయన చేసిన మేలు ఎంత చెప్పినా తక్కువే. ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లను వైఎస్సార్‌సీపీకి కట్టబెట్టి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– బెల్లన చంద్రశేఖర్, విజయనగరం ఎంపీ

# అన్నదాతలకు ఆర్థిక భరోసా

- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా నిధులు విడుదల
- జిల్లాలో 2,33,969 మంది రైతులకు రూ.96.68కోట్ల లబ్ధి
- రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన సీఎం జగన్



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ తదితరులు

నంద్యాల: దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులు, కౌలు రైతులు, దేవదాయ భూములు సాగు చేసుకునే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి బహిరంగ సభ నుంచి మంగళవారం వరుసగా ఐదో ఏడాది రెండవ విడతగా వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ ఆర్థిక సహాయాన్ని రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతులకు బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వంగాల భరత్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీస్సా, అధికారులు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క రైతుకు నాలుగు వేల రూపాయలు చొప్పున రైతు భరోసా పీఎం కిసాన్ ఆర్థిక సహాయాన్ని ఈ ఏడాది రెండో విడత అందించిందన్నారు. అర్హులైన రైతులకు ఏటా రూ.13,500 ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.

- జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వరుసగా ఐదో ఏడాది రెండవ విడతగా జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా కింద అర్హులైన 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు జమ చేసిందన్నారు. జిల్లాలో రైతు భరోసా కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 48,990 మంది రైతులకు రూ.20.36 కోట్లు, బనగానపల్లెలో 44,488 మంది రైతులకు రూ.18.29 కోట్లు, డోన్‌లో 37,375 మందికి రూ.15.38 కోట్లు, నందికొట్కూరులో 42,302 మందికి రూ.17.49 కోట్లు, నంద్యాలలో 16,112 మందికి రూ.6.66 కోట్లు, పాణ్యంలో 15,649 మంది రైతులకు రూ.6.45కోట్లు, శ్రీశైలంలో 29,053 మంది రైతుల ఖాతాల్లోకి రూ.12.01కోట్లు వెరసి మొత్తం 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం రైతులకు రైతు భరోసా చెక్కు అందజేశారు.
- రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు, అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.
- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో కౌలు రైతులకు కూడా పెద్ద ఎత్తున రైతు భరోసా ఆర్థిక లబ్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి చేకూరుస్తున్నారన్నారు.
- కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఎంపీపీ ప్రభాకర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, ఏంఎస్ఎంఈ డైరెక్టర్ అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

### సీఎంకు ధన్యవాదాలు



ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట తప్పకుండా ఏటా పంటల సాగుకు ముందే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఈ ఏడాది మొదటి విడత రైతు భరోసా సాయం ఖరీఫ్ పంట సాగుకు నెల ముందు నిధులు జమ చేశారు. రెండో విడత సకాలంలో అందజేసిన ముఖ్యమంత్రిని ఎప్పుడూ మరిచిపోం.

– తిరుపతిరెడ్డి, మిట్నాల, నంద్యాల (మం)

### జగనన్న పాలనలో రైతులు క్షేమం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు క్షేమంగా ఉన్నారు. పొలం దున్నడం మొదలు కొని పంట అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అన్ని వేళలా అండగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందేలా చొరవ చూపడం అభినందనీయం.

– వెంకటరామిరెడ్డి, కానాల గ్రామం నంద్యాల(మం)

## ఎస్ఐ నాగరాజు హల్‌చల్

- మద్యం మత్తులో స్వగ్రామం సూదేపల్లెలో వీరంగం
- వైరి వర్గంపై దాడి
- ఒకరికి తీవ్ర గాయాలు
- ఘటనా స్థలానికి వెళ్లిన వెల్దుర్తి పోలీసులపై బూతు పురాణం



మద్యం మత్తులో వీధుల్లో తిరుగుతున్న ఎస్ఐ బోడెల్ల నాగరాజు

**వెల్దుర్తి(కృష్ణగిరి):** నంద్యాల జిల్లాకు చెందిన ఎస్ఐ బోడెల్ల నాగరాజు మద్యం మత్తులో స్వగ్రామంలో వీరంగం సృష్టించాడు. ఘర్షణ రేపి, వైరి వర్గంపై దాడులు చేశాడు. చివరకు ఆపేందుకు వచ్చిన పోలీసులపై సైతం దూషణలకు దిగడంతో సదరు ఎస్ఐతో పాటు మరో 13మందిపై కేసు నమోదైంది. వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి మండల పరిధిలోని సూదేపల్లె గ్రామానికి చెందిన బోడెల్ల నాగరాజు ఇటీవల ప్యాపిలి ఏఎస్ఐగా ఉండి పదోన్నతిపై నంద్యాల జిల్లాకు ఎస్ఐగా నియమితుడయ్యాడు. అక్కడి ఎస్పీ అటాచ్‌గా విధి నిర్వహణలో ఉన్నాడు. స్వగ్రామమైన సూదేపల్లెకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి మద్యం మత్తులో వీధుల్లో తిరుగుతూ వీరంగం సృష్టించాడు. రస్తా పంచాయితీ, దాయాదుల మధ్య మనస్పర్థలను, పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని వైరి వర్గం వారిపై దూషణలకు దిగుతూ తిరిగాడు. ఈ క్రమంలో తన వర్గానికి చెందిన మరో 13 మందిని కలుపుకుని గుంపుగా ప్రత్యర్థి వర్గంలోని వైకుంఠం అచ్చయ్య ఇంటికి వెళ్లి దాడి చేసి గాయపడ్డాడు. ఇదంతా గ్రామస్తులు కొందరు సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకోగా ఎస్ఐ నాగరాజు బూతు పురాణం అందుకున్నాడు. అతని వర్గానికి చెందిన కొందరు పోలీసులపై దూషణలకు దిగి దాడికి ప్రయత్నించారు. కాగా గాయపడిన అచ్చయ్య కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో నంద్యాల జిల్లా ఎస్ఐ నాగరాజు, మరో 13 మందిపై దాడి ఘటనపై ఫిర్యాదు చేశాడు. దీనిపై వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి విచారణ జరిపి బోడెల్ల నాగరాజు, రాముడు,శివరాముడు, నాగేంద్ర, తిమ్మరాజు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, కోటేశ్వరులు, ప్రసాద్, సుబ్బయ్య, శివుడు, మద్దిలేటి, సంతోష్, పెద్ద తిమ్మన్న మరి కొందరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

# అభివృద్ధి జరగలేదని నిరూపించగలరా?

- టీడీపీ నేతలకు మంత్రి బుగ్గన సవాల్
- డోన్‌లో రూ. 3కోట్లతో కాపుభవన్‌కు శంకుస్థాపన



కాపుభవన్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

**డోన్:** నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు జరగడం లేదని తెలుగు దేశం పార్టీ నాయకులు నిరూపించగలరా? అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి సవాలు విసిరారు. డోన్‌లో రూ.3 కోట్లతో కాపు(బలిజ) భవన్ నిర్మాణానికి మంగళవారం మంత్రి బుగ్గన భూమి పూజ చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాపుల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అనేక సంక్షేమ పథకాల ద్వారా కాపులతో పాటు అన్ని వర్గాల ప్రజలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుందన్నారు. కరువు పేరుతో రాష్ట్ర టీడీపీ నాయకులు ఇటీవల డోన్ నియోజకవర్గంలో పర్యటించి డోన్ అభివృద్ధిపై అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాపు భవన నిర్మాణానికి కోటి రూపాయలు విలువ చేసే 30 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ఐపీ ప్రసాద్‌ను మంత్రి శాలువా కప్పి పూల మాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు పటేల్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కురుకుంద హరి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, బలిజ సంఘం నాయకులు ఐపీ శేఖర్, జగన్ మోహన్, కురుకుంద శేఖర్ వర్క్‌షాప్ చెన్నయ్య, ఆలా శివ నాగిరెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### ధర్మారం అబద్ధాలకోరు..

రోజుకో పార్టీ మారుతూ, పూటకో వ్యక్తి పంచన చేరే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి అబద్ధాలకోరు అని మంత్రి బుగ్గన దుయ్యబట్టారు. సొంత పార్టీ నాయకులతో పాటు ప్రజలను మోసం చేసిన ధర్మారం తనపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకర్గంలో రూ. 253 కోట్లతో చేపట్టిన 36 చెరువులకు నీరందించే పథకంపై టీడీపీ నేతల విమర్శలు సహేతుకం కాదన్నారు. 36 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరందించి 24 గ్రామాలకు సాగు నీరు సరఫరా చేయడం లేదని టీడీపీ నాయకులు నిరూపించగలరా అని సవాలు చేశారు. నియోజకవర్గంలోని పెద్ద మల్కాపురం, వలిసెల లాంటి మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి రూ. 100 కోట్లతో హైవేపై అండర్ పాస్ బ్రిడ్జీలు, నేషనల్ హైవేలు, నగరవనంతో పాటు పార్కులు, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మించింది ఎవరని నిలదీశారు.

### బూటకపు హామీలను ప్రజలు నమ్మరు

డోన్‌లో ఉన్న 30 వేల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున ఇంటిస్థలాలు ఇస్తానని బూటకపు వాగ్దానం చేస్తున్న టీడీపీని ప్రజలు ఎలా నమ్ముతారని మంత్రి బుగ్గన నిలదీశారు. ఇందు కోసం టీడీపీ అధిష్టానం రూ. 1700 కోట్లను ఎన్నికల ముందు ప్రజల పేరుపై డిపాజిట్ చేసే దమ్ము ఉందా అని మంత్రి సవాలు విసిరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చిన తర్వాత టీడీపీ నాయకులు ఇళ్లు ఎవరికీ కట్టిస్తారని ప్రశ్నించారు. ఎకరాకు రెండు కోట్ల చొప్పున చెల్లించి 700 ఎకరాలకు రూ. 1700 కోట్ల డబ్బు ఎక్కడ నుంచి తెస్తారని ఆయన ధర్మారం సుబ్బారెడ్డిని నిలదీశారు. దీనిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత టీడీపీ నాయకులదే అని మంత్రి గుర్తు చేశారు.



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలువురు ఆమెకు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజును పురస్కరించుకుని పత్తికొండ పట్టణంలో ఆరుగురు దివ్యాంగులకు ఎమ్మెల్యే ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. - పత్తికొండ టౌన్

## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**కర్నూలు:** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా పోలీసుల వలకు చిక్కింది. ఇటీవల కాలంలో పలు ఆలయాల్లో వరుస దొంగతనాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు తాలూకా సీఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు దొంగలు జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు మండలం బుర్దిపాడు గ్రామానికి చెందిన మల్లెపోగు బాబు, కురువ వీరేష్, ఎండీ షాకీర్, ఇటిక్యాల మండలం బుడ్డారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వడ్డె శివరాజు, వడ్డేపల్లి మండలం శాంతి నగర్‌కు చెందిన తెలుగు శివచరణ్‌లుగా గుర్తించి అరెస్టు చేసి విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ శివారులోని వెంగన్న బావి సమీపంలో ఉన్న దేవాలయం, గొందిపర్ల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ శివారులోని కొండపై కొలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయాల్లో హుండీలను ధ్వంసం చేసి బంగారు, వెండి వస్తువులు, నగదును కాజేసినట్లు అంగీకరించారు.అలాగే వెంగన్న బావి దగ్గర లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద పార్క్ చేసి ఉంచిన లారీల్లో డీజిల్ దొంగతనానికి పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించారని సీఐ శ్రీరామ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2.20 లక్షలు విలువ చేసే బంగారు,వెండి ఆభరణాలు, నేరానికి ఉపయోగించిన కారును సీజ్ చేశామన్నారు. తర్వాత ఐదుగురు నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

## భక్తులకు రూ. 40 కోట్లతో వసతి సముదాయం



ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

- రూ.23కోట్లతో డార్మెంటరీ నిర్మాణం
- శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తుల వసతి కోసం రూ.40 కోట్ల అంచనా వ్యయంతో 200 గదులను నిర్మించనున్నట్లు శ్రీశైల దేవస్థాన ం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో మొత్తం 52 అంశాలు ప్రవేశ పెట్టగా 51 అంశాలకు ట్రస్ట్ బోర్డు ఆమోదం తెలిపింది. ఆ వివరాలను బోర్డు చైర్మన్ వెల్లడించారు. అందులో ముఖ్యమైనవి కొన్ని

- రూ.7కోట్ల అంచనా వ్యయంతో క్షేత్రంలో 0.5 మెగావాట్ల సామర్థ్యంతో రెండు సోలార్‌ప్లాంట్ల ఏర్పాటు
- ఆలయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా దేవస్థానంలో సంగీత నృత్య కళాశాల
- ఉద్యానవనాల సుందరీకరణ
- సున్నిపెంట స్టాఫ్ క్వాటర్స్ వద్ద రూ.5.80 కోట్ల అంచనా వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్, డీజిల్ జనరేటర్, ప్యానల్‌బోర్డు తదితరవి ఏర్పాటు
- రానున్న మహాశివరాత్రి, ఉగాది మహోత్సవాలకు రూ. 23 లక్షలతో జంగిల్ క్లియరెన్స్ పనులు
- రూ.23 కోట్ల అంచనా వ్యయంతో డార్మెంటరీ నిర్మాణం
- క్షేత్ర పరిధిలో రాజకీయ విమర్శలు, ప్రచారాలు నిషేధం
- సమావేశంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, ఓ.మధుసూదన్‌రెడ్డి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, డా.సి.కనకదుర్గ, ఎం.విజయలక్ష్మి, జంగం సుజాతమ్మ, నరసింహరెడ్డి, మురళీ, విజయలక్ష్మి, అంబాల లక్ష్మీసావిత్రమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, సహాయ కమిషనర్ వెంకటేష్, ఈఈ వి.రామకృష్ణ, దేవస్థాన అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఓటరు సవరణ విజ్ఞప్తులపై స్పందించండి

**కర్నూలు(సెంట్రల్):** ఓటరు జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి విడుదలైన ముసాయిదాలో అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముసాయిదా జాబితాపై జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముసాయిదా జాబితాపై డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. అలా వచ్చిన విజ్ఞప్తులను అధికారులు డిసెంబర్ 26లోపు పరిష్కరించి తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన విడుదల చేయాలన్నారు. కాగా, అభ్యంతరాల పరిశీలనలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓల సూచనలతో బీఎల్‌ఓలు తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. ఓటరును తొలగించే ముందు అందుకు సంబంధించి సర్టిఫికెట్లను కచ్చితంగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కర్నూలు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను జేసీ నారపురెడ్డి మౌర్య రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. పది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు జిల్లాలో 3,273 ఉన్నట్లు గుర్తించామని, ఇందులో 47,686 మంది ఓట్లు ఉన్నారని, వీరిలో 29,071 నిజమైన ఓటర్లుగా గుర్తించామన్నారు. 17,404 మంది ఓటర్లు వేరే ప్రాంతాల నుంచి వచ్చారని చెప్పారు. నిర్ణీత ఫారం ద్వారా ప్రస్తుతానికి 4,225 మంది ఓటర్ల వివరాలు సరి చేశామని, ఇంకా 13044 మంది వివరాలు పరిశీలించాల్సి ఉందన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు అరెస్టు

**కర్నూలు:** నగరంలోని దేవనగర్ రైల్వే గేటు సమీపంలో మంగళవారం క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా మూడో పట్టణ ఎస్ఐ వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. దేవనగర్‌కు చెందిన పిక్కిలి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు తలారి వెంకటేష్, ముత్తు అనే వ్యక్తులు పారిపోయారు. వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బెట్టింగ్ మొత్తం డబ్బులు రూ.2 లక్షలతో పాటు శ్యామ్‌సంగ్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## 78 ఆటోలు సీజ్

**బొమ్మలసత్రం:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలల నుంచి నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న 78 ఆటోలను సీజ్ చేశామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరిమితికి మించి ప్రయాణించిన ఆటోలపై ఆర్టీవో అధికారులు రూ. 2,39,200 చలనాలు విధించటం జరిగిందన్నారు. ప్రమాదాల నివారణ కోసం అధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా ప్రతి చోట సూచికలు ఏర్పాటు చేశామని అయినప్పటికీ కొందరు వాటిని గమనించకుండా ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని సూచించారు.



## గడువులోపు రీసర్వే పూర్తి కావాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**కర్నూలు(సెంట్రల్):** నిర్దేశించిన గడువులోపు రీసర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె జిల్లా, మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ, హౌసింగ్, రీసర్వే తదితర ప్రాధాన్యత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రీసర్వేకు సంబంధించి ఎల్‌పీఎం జనరేషన్‌ను పూర్తి చేయడంలో కర్నూలు రూరల్ మండలంలోని రేమట, బసాపురం, గూడూరు మండలంలోని మునగాల, గుడిపాడు, కోసిగి మండలంలోని జుమ్మలదిన్నెలలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు జరగ లేదన్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు సమన్వయంతో రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్‌కి సంబంధించి స్టేజ్ కన్వర్షన్ పనుల్లో పురోగతి కనిపించడంలేదన్నారు. ఈ విషయంలో కోడుమూరు హౌసింగ్ ఏఈపై తగిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సి.బెళగల్, ఎమ్మిగనూరు అర్బన్, కర్నూలు మండలాలు హౌసింగ్ పనుల్లో జీరో పురోగతి నమోదు చేశారని, మళ్లీ పునరావృతమైతే సంబంధి హౌసింగ్ ఏఈలపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈనెల 15నుంచి ప్రారంభించాల్సిన స్వమిత్ర ప్రాపర్టీ కార్డుల పంపిణీకి జిల్లాలో 38 గ్రామాలు ఎంపికైనట్లు చెప్పారు. సంక్షేమ హాస్టళ్ల సమీపాల్లో చెత్త, చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నటేకూరు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థికి పాము కరిచిన ఘటనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబును ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.



## తరిగోపుల బుక్ కీపర్ మాయాజాలం

- రూ.8.32 లక్షలు కాజేసిన వైనం
- పోలీసులను ఆశ్రయించిన ఏపీఎం, పొదుపు సంఘాల మహిళలు

**జూపాడుబంగ్లా:** తరిగోపుల గ్రామానికి చెందిన బుక్ కీపర్ రామ్మూర్తి రూ.8.32 లక్షల శ్రీనిధి డబ్బులు స్వాహా చేశాడు. పెద్ద మొత్తంలో డబ్బులు కాజేసిన బుక్ కీపర్‌పై మంగళవారం ఏపీఎం అంబమ్మ, పొదుపు సంఘాల మహిళలు స్థానిక పోలీసుస్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు రామ్మూర్తి పరిధిలో 16 పొదుపు సంఘాలుండగా అందులో 54 మంది సభ్యులున్నట్లు తెలిపారు. వారు తీసుకొన్న శ్రీనిధి రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో నెలవారి కంతు నగదును బ్యాంకులో చెల్లించకుండా రామ్మూర్తి స్వాహా చేసినట్లు ఐదు నెలల క్రితమే గుర్తించి నిలదీశారు. తాను తీసుకున్న మొత్తం బ్యాంక్‌లో చెల్లిస్తానని నమ్మబలికి జాప్యం చేయడంతో పొదుపు మహిళలు చెల్లించాలని కోరారు. అయితే తనపై ఒత్తిడి చేస్తే అందరి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో ఏపీఎం, పొదుపు మహిళలు జూపాడుబంగ్లా ఎస్ఐ మారుతిశంకర్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు రికవరీ చేయాలని కోరారు. ఈ విషయమై ఏపీఎం అంబమ్మ మాట్లాడుతూ బుక్‌కీపర్‌గా ఉంటూ పొదుపు మహిళల డబ్బులు స్వాహాచేసిన రామ్మూర్తిని విధుల్లోంచి తొలగించటంతోపాటు అతనిపై జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుక్ కీపర్లు (వీఓఏ) ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు.

## కరువును పట్టించుకోని ప్రభుత్వాలు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** రాష్ట్రంలో తీవ్ర కరువు నెలకొన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని.. 18 జిల్లాల్లోని 449 ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు, నంద్యాల డీసీసీ అధ్యక్షులు కె.బాబురావు, జె.లక్ష్మీ నరసింహ ఆధ్వర్యంలో కర్నూలులో రైతు గర్జన ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడితో పాటు సీడబ్ల్యూసీ కమిటీ సభ్యుడు రఘువీరా రెడ్డి, రాష్ట్ర నాయకులు మస్తాన్‌వలి, జేడీ శీలం తదితరులు హాజరయ్యారు. ముందుగా నగరంలోని రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్నదాతలు తీసుకున్న రుణాలను మాఫీ చేసి కొత్త లోన్లు మంజూరు చేయాలని సూచించారు. ఉపాధి హా మీ పనులు కల్పించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

### 20, 21వ తేదీల్లో సీపీఐ 30 గంటల ఆందోళన

**కర్నూలు(సెంట్రల్):** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 20, 21వ తేదీల్లో విజయవాడలో 30 గంటల పాటు ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

## ఆశల దీపం ఆరిపోయింది

- అదృశ్యమైన విద్యార్థి గని గుంతలో శవమై తేలి



విద్యార్థి ప్రవీణ్(ఫైల్)

**కొలిమిగుండ్ల:** ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెల తర్వాత కలిగిన కుమారుడిని అల్లారు ముద్దుగా చూసుకున్నారు. బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలని కలలుగన్నారు. అంతలోనే విషాదం చోటు చేసుకుంది. బడికి వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాలేదు. రోజులు గడుస్తున్నా ఎక్కడా ఆచూకీ లభించలేదు. క్షేమంగా తిరిగి రావాలని దేవుళ్లను మొక్కారు. చివరకు వారి ఆశలు ఆవిరయ్యాయి. 13 రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థి గని గుంతలో విగతజీవిగా శవమై తేలాడు. ఈ విషాదకర సంఘటన బందార్లపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోగుల రామచంద్ర, అరుణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ప్రవీణ్(13). గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అక్టోబర్ 28వ తేదీన పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు పాఠశాల పరిసర ప్రాంతాల్లో గాలించడంతో పాటు గ్రామంలోని ఇతర విద్యార్థులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విషయం చెప్పడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విద్యార్థి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ సమీపంలో గని గుంతలో ఈతకెళ్లిన పిల్లలకు ప్రవీణ్ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 13 రోజులు గడవడంతో మృతదేహం పూర్తిగా దెబ్బతింది. 13 రోజుల నుంచి ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రవీణ్ బడి నుంచి ఇంటికి వెళ్లకుండా ఈత కొట్టేందుకు ఒక్కడే గని గుంత వద్దకు వెళ్లి నీట మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం తీసుకెళ్లేందుకు వీలుపడక పోవడంతో నంద్యాల నుంచి వైద్యులను అక్కడికే పిలిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## మద్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- సెబ్ అధికారులను ఆదేశించిన డీఆర్వో మధుసూదనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదనరావు

**కర్నూలు(సెంట్రల్):** తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు అక్రమ మద్యం రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్వో మధుసూదనరావు సెబ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్వో అబ్కారీ, సెబ్ అధికారులతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, నివారణలపై విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ..కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లోని చెక్ పోస్టులను అప్రమత్తం చేసి అక్రమ మద్యం రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకుని అమలు చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని, అయితే, కొంత సిబ్బంది కొరత ఉందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్/ఏపీబీసీఎల్ మేనేజర్ జి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ రాముడు డీఆర్వోకు వివరించారు.